పాఠశాల కిచెన్ షెడ్డులో గొర్రెల మంద

- బిల్లులు చెల్లించ లేదని మాజీ చైర్మన్ నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు చాలా కాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి బడిలో నిర్మించిన వంట షెడ్డులో గొర్రెలను తోలి నిరసన వ్యక్తం చేశారు. మన ఊరు-మనబడి మొదటి విడత పనుల్లో భాగంగా నిర్మించిన వంట గది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో సోమవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామంలో ఎస్‌ఎంసి మాజీ చైర్మన్ దండికే శంకరయ్య వంటశాలలో గొర్రెలను తోలి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేగుంట గ్రామంలో మన ఊరు-మన బడి మొదటి విడతలో పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. ఏడాది గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో తీవ్ర అర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. ఇటీవల కిచెన్ షెడ్ నిర్మాణం పూర్తయినప్పటికీ ఖాతాలో ఉన్న 2లక్షల 35 వేల రూపాయలు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక సోమవారం ఉదయం బడి పిల్లలు వచ్చే సమయానికి మేకలు, గొర్రెల మందను నూతనంగా నిర్మించిన కిషన్ గదిలోకి తోలి.. అధికారులకు విషయం చెప్పానని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు రావాల్సిన బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎంఇఒ వాసం భీమయ్యని స్పందిస్తూ.. కిచెన్ షెడ్డుకు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమ అయినా.. వాటిని ఎలా డ్రా చేయాలనేది ప్రభుత్వం నుంచి ఎటువంటి విధివిధానాలూ రాలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వాటిని అందజేస్తామని చెప్పారు.

సుంకిశాల ప్రమాదంపై చర్యలేవి?

- రాహుల్ గాంధీని ప్రశ్నించిన కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుంకిశాల ప్రాజెక్ట్ ప్రహరీ గోడ కూలిన ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఎక్స్ వేదికగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. సంఘటన జరిగిన వారం వరకు ఎందుకు దాచి పెట్టారో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. ప్రమాదానికి కాంట్రాక్ట్ సంస్థ కారణమైతే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదులేమీ రాలేదు

- గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మందుల కొరత ఉన్నట్టుగా రోగుల నుంచి తమకు చెప్పుకోదగ్గ ఫిర్యాదులేమీ రాలేదని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి స్పష్టం చేశారు. మందుల కొరతపై మీడియాలో వచ్చిన కథనాలపై సోమవారం ఆమె స్పందించారు. జాతీయ స్థాయిలో గుర్తించిన అత్యవసర స్థాయి మందులన్నీ తమ ఆస్పత్రిలో ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా చిన్నపాటి ఇబ్బంది ఉంటే పరిష్కరించేలా సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. టిజిఎంఎస్ఐడిసి నుంచి వస్తున్న 80 శాతం మందులను అందుబాటులో ఉంచామని, మిగిలిన 20 శాతం మందులను అత్యవసర సమయాల్లో అవసరమైనప్పుడు కొనుగోలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో 'కొరియన్' పెట్టుబడులు

- త్వరలో తెలంగాణను సందర్శించనున్న ఎల్ఎస్ కంపెనీ
- సియోల్‌లో పలువురు పారిశ్రామికవేత్తలతో సిఎం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం పలు ప్రపంచస్థాయి కంపెనీల అధినేతలు, వ్యాపార బృందాలతో చర్చలు జరిపింది. ఈ క్రమంలో కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (కొఫ్టి) ఆధ్వర్యంలో బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో యాంగాన్ చైర్మన్ కిహక్ సుంగ్, కొఫ్టి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సోయాంగ్ సహ 25 భారీ జౌళి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు తెలంగాణలో టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి ఉన్న సానుకూలతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పిలుపునకు కొరియన్ టెక్స్‌టైల్ కంపెనీల ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. దక్షిణ కొరియాలో అతి పెద్ద పారిశ్రామిక సంస్థ అయిన ఎల్ఎస్ కంపెనీ ప్రతినిధులు త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం ఎల్ఎస్ గ్రూప్ చైర్మన్‌కు జా యున్ నేతృత్వంలోని ఆ కంపెనీ సీనియర్లతో సమావేశమైంది. సమావేశంలో తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుళ్లు, గ్యాస్, విద్యుత్, బ్యాటరీల ఉత్పత్తి, పెట్టుబడులపై చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు ఎల్ఎస్ బృందం త్వరలోనే తెలంగాణకు రానుంది. ఎల్ఎస్ కంపెనీ గతంలో ఎల్‌జి గ్రూప్‌లో భాగస్వామిగా ఉండేది.

హ్యుందాయ్ కంపెనీ వాళ్లతో సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో హెచ్ఎంఐఇ కారు మెగా టెస్ట్ సెంటర్

దక్షిణ కొరియా ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ దాని భారతీయ విభాగమైన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలంగాణలో కారు మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించాలని యోచిస్తోంది. మెగా టెస్ట్ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం (ఇవిలతో సహా) ఉంటుంది. అలాగే హైదరాబాద్‌లో ఉన్న ఇంజినీరింగ్ కేంద్రం పునరుద్ధరణ, ఆధునీకరణ, విస్తరణ ద్వారా హ్యుందాయ్ భారతదేశం సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మరింత ఉపాధిని కల్పించనుంది. తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతత్వంలోని దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సియోల్‌లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ అధికారులతో సోమవారం (12-08-2024) సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చల అనంతరం హ్యుందాయ్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశం తమకు చాలా ముఖ్యమైన మార్కెట్ అని, భారతీయ వినియోగదారుల కోసం బెంచ్‌మార్క్ సెట్టింగ్ ఉత్పత్తులు, సాంకేతికత అభివద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. అత్యాధునిక పరీక్షా సౌకర్యాల అభివద్ధి చేసేందుకు తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు హెచ్ఎంఐఈ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి పెట్టుబడులను తెలంగాణలో పెట్టించేందుకు తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హ్యుందాయ్ మోటార్ కంపెనీ తన అనుబంధ సంస్థ హ్యుందాయ్ ద్వారా తెలంగాణలో కార్ టెస్టింగ్ సదుపాయం నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టాలని ప్రణాళిక రచిస్తోందన్నారు. రాష్ట్రం అనుసరిస్తున్న పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల ఏర్పాటు, ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థతో ప్రగతిశీల, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తెలంగాణలో వ్యాపారం చేసేందుకు హ్యుందాయ్ వంటి అత్యుత్తమ-తరగతి కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు.

హెచ్ఎంఐఈ మెగా టెస్ట్ సెంటర్ సమీపంలోని సౌకర్యాలు ఇతర అనుబంధ సంస్థలు, సరఫరాదారులను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుంది.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

రైతులకు అన్యాయం చేయొద్దు

- ఫార్మా కంపెనీల కోసం రైతుల భూములు తీసుకోవద్దు : ఎమ్మెల్యే మాణిక్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల భూముల జోలికొస్తే ఉద్యమాలకు సైతం వెనుకాడబోమని.. కంపెనీల పేర అన్నదాతలకు అన్యాయం చేయొద్దని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసమంటూ ఇటీవల కలెక్టర్, రెవెన్యూ అధికారులు సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పుర్, వడ్డీ, మల్గి గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టారు. కాగా, సాగు చేసుకునే భూములను ఏ కంపెనీలకూ ఇవ్వబోమంటూ రైతులు ఆనాడే అధికారులకు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల రైతులతో కలిసి బిఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న రైతులకు నష్టం కలిగించే చర్యలు చేపట్టొన్నారు. ఫార్మా కంపెనీల పేరు చెప్పి.. రైతుల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. రైతుల భూములు గుంజుకోవాలని చూస్తే ఉద్యమాలకూ వెనుకాడబోమని హెచ్చరించారు. పచ్చటి పొలాల మధ్యకు కంపెనీలను తీసుకొచ్చి.. కాలుష్యం చేయొద్దన్నారు. మంత్రులు, జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. అనంతరం ఫార్మా కంపెనీల కోసమని రైతుల భూములు తీసుకోవద్దంటూ జహీరాబాద్ ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, నాయకులు నరసింహారెడ్డి, తట్టు నారాయణ, రవికుమార్, మారుతి, రైతులు కిరణ్ గౌడ్, శివరాజ్, రాజు పటేల్, రవి గౌడ్, సుభాష్ సెట్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం

- పెద్దకొడప్‌గల్ తహసీల్దార్ కార్యాలయంలో ఘటన
- రూ.20 వేలు తీసుకున్నా పాస్‌పుస్తకం ఇవ్వడం ఆరోపణ

హైదరాబాద్ బ్యూరో : పట్టాపాస్ పుస్తకం ఇవ్వడం లేదంటూ ఓ రైతులు ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితుడి వివరాల ప్రకారం.. వడ్లం గ్రామానికి చెందిన రైతు అంజయ్య భూమి పట్టా పాస్‌పుస్తకం కోసం కొన్ని నెలల కిందట దరఖాస్తు చేసుకున్నాడు. కాగా, ఆర్‌ఐ పండరి రూ.20 వేల లంచం అడిగితే నగదు ఇచ్చాడు. అయినప్పటికీ ఆర్‌ఐ పండరి పాసుపుస్తకం ఇవ్వకుండా.. రేపు మాపంటూ కాలయాపన చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేశాడు. దాంతో మనస్తాపం చెందిన రైతు అంజయ్య తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణికి వచ్చి అక్కడే పురుగుల మందు తాగాడు. వెంటనే స్థానికులు అతన్ని పెద్దకొడప్‌గల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తహసీల్దార్ దశరథ్ స్పందిస్తూ.. రైతు అంజయ్య భూమి పార్ట్-బి.లో ఉందని, దానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఏమీ చేయలేమని తెలిపారు. ఆర్‌ఐ పండరి రైతు వద్ద రూ.20 వేలు తీసుకున్నట్టు తమ దృష్టికి దీనిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

గురుకుల విద్యార్థుల మృతి ఆందోళనకరం

- ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులు మృతిచెందడటం ఆందోళనకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థి అనిరుద్ మృతి చెందిన విషయం విదితమే. అతని కుటుంబాన్ని సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో సోమవారం సిరిసిల్ల ఎమెల్యే కేటీఆర్ పరామర్శించారు. పార్టీ నుంచి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. కొంతకాలంగా సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆలాన పాలనలో నిర్లక్ష్యం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 8నెలల కాలంలో 36మంది విద్యార్థులు మృతి చెందారని చెప్పారు. ఆత్మహత్యలు, పాముకాటుకు గురై విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 8నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లలో కల్తీ, నాణ్యత లేని ఆహారం వల్ల 5వేల మంది విద్యార్థులు ఆస్పత్రుల పాలయ్యారని వాపోయారు. వివిధ కారణాలతో మృతిచెందిన 36మంది పేద విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా విద్యార్థులకు మంచి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. మిగతా విద్యార్థుల తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చొద్దని విజ్ఞప్తి చేశారు. బిఆర్‌ఎస్ నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ వేస్తున్నట్టు ప్రకటించారు. ఆ కమిటీ ద్వారా పాఠశాలల వసతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలు

- ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం గోల్కొండ కోటను ఆమె సందర్శించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని డీజీపీ జితేందర్‌కు సూచించారు. మనదేశ సాంస్కృతిక వారసత్వం ప్రతిభింబించేలా సాంప్రదాయ దుస్తులలో కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ తెలిపారు. గుస్సాడి, కొమ్ము కోయ, లంబాడీ, డప్పులు, ఒగ్గుడోలు ప్రదర్శన, బోనాల కోలాటం, భైండ్ల జమిడికల్, చిందు యక్షగానం, కర్రసాము, కూచిపూడి, భరతనాట్యం, పేర్ని వంటి వివిధ కళారూపాలకు చెందిన వెయ్యి మందికిపైగా కళాకారులు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనలు ఇస్తారన్నారు. పిల్లల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిల్చేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సిఎస్ వెంట డిజిపి జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'సీతారామ' పూర్తికాకుండానే ప్రారంభమా..?

- నీరు ఎలా విడుదల చేస్తారు?
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని, టి సాగర్

సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సీతారామ ప్రాజెక్టులో భాగంగా లిఫ్ట్ పనులు పూర్తి కాకుండానే ఎలా ప్రారంభిస్తారు.. బహుళ ప్రయోజనాలతో రూ.3,500 కోట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పూర్తి కాకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చింది..? ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారు..? గోదావరిపై సీతమ్మ సాగర్ డ్యామ్ పూర్తికాకుండా నీరు ఎలా విడుదల చేస్తారు.." అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం కేంద్రంలో ఎలమంచిలి వంశీకృష్ణ అధ్యక్షతన సోమవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తికాకుండానే హడావుడిగా ప్రారంభోత్సవానికి ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. రూ.18 వేల కోట్లతో చేపట్టిన ఈ లిఫ్ట్ నిర్మాణంలో ఇప్పటివరకు రూ.8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇంకా పదివేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండానే ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గోదావరిపై సీతమ్మ సాగర్ డ్యామ్ పూర్తి కాకుండానే సీతారామ ప్రాజెక్టుకు నీరు ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మూడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించిన తర్వాత ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలు ఈ నీటి కోసం ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారన్నారు. సీతమ్మ సాగర్ బహులార్థక సాగర్ ప్రాజెక్టు అని, 280 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 30 టిఎంసిల వాటర్ స్టోరేజ్, రహదారి, మిషన్ భగీరథ, హెవీ వాటర్ ప్లాంట్ వంటి బహుళ ప్రయోజనాలతో రూ.3,500 కోట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పూర్తి కాకుండా నీళ్లు విడుదల చేయటం అసాధ్యమని అన్నారు. ఓ వైపు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తూ.. మరోవైపు 2028 ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి ప్రకటించటం విడ్డూరంగా ఉందని అన్నారు. అలాంటప్పుడు ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే ఎందుకు ప్రారంభిస్తున్నారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, కున్సోత్ ధర్మ, కొండబోయిన వెంకటేశ్వర్లు, రవికుమార్, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, కనక రత్నం, సత్యనారాయణ, నల్లగోపు పుల్లయ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారి కోర్టులో

I.P.No.8/2018

బిట్వీన్ :
శ్రీ కోమర్తి సత్యనారాయణ ...పిటీషనర్
మరియు
శ్రీ వెల్లంకి సాయి ఈశ్వర్ మరియు 3 యితరులు ...రెస్పాండెంట్లు

4వ ప్రతివాది: శ్రీమతి కొక్కిరాల అన్నపూర్ణ, W/o. శ్రీ కొక్కిరాల రవికుమార్, హిందూ, స్త్రీ, వయస్సు 46, గృహిణి, ప్లాట్‌నెం.306, బి-బ్లాక్, సంఘమిత్ర స్కూల్ దగ్గర, నిజాంపేట రోడ్, బాలానగర్, హైదరాబాద్ - 500085, కుకట్‌పల్లి కోర్టు SCJ పరిధి.

పై గ్రంథములో శ్రీకోర్టు వారి ద్వారా 4వ ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి వాటిని తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు **ది.20-08-2024 తేది ఉదయం 10.30** గంటలకు పై కోర్టు వారి యెదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

శ్రీ అద్దంకి విజయరత్నం
తాడేపల్లిగూడెం అడ్వకేట్,తాడేపల్లిగూడెం
ది.13-08-2024 సెల్:9290188928

సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

మెట్రో రైళ్ల బోగీలను పెంచాలి

- సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యుల నాగలక్ష్మి
- అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ వద్ద సంతకాల సేకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మెట్రో రైలులో బోగీలను మూడు నుంచి ఆరుకు పెంచాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ వద్ద సిపిఎం హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెట్రో రైళ్లలో రద్దీ విపరీతంగా ఉంటోందని, మెట్రో రైలు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో కొందరు వారి స్టేషన్ దాటి పోయిన తర్వాత దిగిన సందర్భాలు ఉన్నాయన్నారు. కావునా మెట్రోకు మరో మూడు బోగీలు కలిపి ఆరు బోగీలు చేయాలని కోరారు. ఈ ఆరు కోచ్‌లకు సరిపోయే విధంగా మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫారం సిద్ధంగా ఉందని.. అయినా బోగీలను పెంచకుండా ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్న మెట్రో యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద ఆగస్టు 13, 14 తేదీల్లో సంతకాల సేకరణ చేపడతామని చెప్పారు. 17వ తేదీన బేగంపేట మెట్రో భవన్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు రాపర్తి అశోక్, నాయకులు టి సాయి శేషగిరిరావు, జె స్వామి, బి సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖనిజాల తవ్వకాల్లో ప్రయివేటుకు పెద్దపీట

- ఎపిలో ఎంఇఆర్ఐటి ఏర్పాటు అభినందనీయం
- ఎన్ఎంఇటి గవర్నింగ్ బాడీ మీటింగ్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మన దేశంలో ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామనీ, అందులో ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు(ఎన్ఎంఇటి) ఆరో గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఎక్స్‌అఫిషియో చైర్మన్ హోదాలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఖనిజ సంపదకు లోటులేదని, అనుకున్నంత మేరకు ఖనిజాల సామర్థ్యాన్ని గుర్తించలేకపోయామని తెలిపారు. దాన్ని దృష్టిలో పెట్టుకునే 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్ఎంఇటిని స్థాపించారని తెలిపారు. దీంతో ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌లో ఏటేటా పురోగతి సాధిస్తున్నామన్నారు. రాష్ట్రాలు ఎన్ఎంఇటి నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎంఇటి తరహాలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంఇఆర్ఐటిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామనీ, ప్రయివేటు రంగానికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని హామీనిచ్చారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టం చేశారు. సహకార సమాఖ్య విధానంలో అన్ని రాష్ట్రాలను కలుపుకుని ముందుకెళ్తామన్నారు. ఎన్ఎంఇటి ద్వారా చేసిన కార్యక్రమాలు, ప్రాజెక్టులను ఆయన వివరించారు. నేషనల్ జియోసైన్స్ డేటా రిపాజిటరీ పోర్టల్ ద్వారా.. ఎక్స్‌ప్లోరేషన్ ద్వారా సాధించిన పురోగతిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కేంద్ర అటామిక్ ఎనర్జీ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ దుబే మాట్లాడుతూ.. దేశంలో ఖనిజాల సామర్థ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ..గనుల రంగంలో తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని ఆఫ్ షోర్ మైనింగ్, క్రిటికల్ మినరల్స్ ఎక్స్‌ప్లోరేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చెరువుల కబ్జాపై ఎవరినీ వదలం

- హైడ్రా కమిషనర్ ఐజి ఎవి రంగనాథ్

హైదరాబాద్ బ్యూరో : ట్రై సిటీలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఐజీ ఎవి రంగనాథ్ అన్నారు. ట్రై సిటీలో చెరువులను పునరుద్ధరించడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని హెచ్చరించారు. కొందరు రియల్టర్లు, బిల్డర్లు ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ లేకుండానే నిర్మాణాలు చేపడుతుంటే.. మరికొందరు నోటరీ భూములు విక్రయిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైడ్రా పనితీరు, తీసుకుంటున్న చర్యలపై కమిషనర్ వివరించారు. ట్రై సిటీలో దాదాపు 400కు పైగా లేక్స్ ఉండేవని, ఎన్ఆర్ఎస్‌సి (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) నివేదిక మేరకు 1979-2023 (మధ్య కాలంలో) నగరంలో దాదాపు 61శాతం చెరువుల విస్తీర్ణం తగ్గిందని, కొన్ని చెరువులు 80 శాతం, మరికొన్ని 100 శాతం కనిపించకుండా పోయాయని తెలిపారు. నగరంలో చెరువులు, పార్కులు, పరిరక్షించడంతోపాటు ఆక్రమణలు, భూ కబ్జాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హైడ్రా మూడు ఫేజ్‌లలో ముందుకెళ్తోందన్నారు. మొదటి ఫేజ్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తు న్నామని, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని హెచ్చరించారు. రెండో ఫేజ్‌లో అక్రమ వెంచర్లు, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ల, పార్కుల స్థలాల్లో నిర్మాణాలను గుర్తిస్తామని తెలిపారు. మూడో ఫేజ్‌లో ఒక కార్యాచరణ ప్రకారం అక్రమ నిర్మాణాలను గుర్తిస్తామని, చెరువులు, కుంటల్లో పూడికలను తీస్తామన్నారు. ఓఆర్ఆర్ వరకు హైడ్రా విస్తరణ ఉందని, ప్రభుత్వం హైడ్రాను చెప్పారు.

DECCAN POLYPACKS LIMITED
Regd. Office : Plot No. A-40, Road No. 7, IDA Kukatpally, Hyderabad-37, Telangana, Ph : 040-23077224

KEY FINANCIAL HIGHLIGHTS OF STANDALONE UNAUDITED FINANCIAL RESULTS

Rs. in Lakhs except per share data

Sl. No.	Particulars	Quarter Ended 30.06.2024	Year Ended 31.03.2024	Quarter Ended 30.06.2023	Year Ended 31.03.2024
1.	Total income from operations	--	--	2.14	2.14
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	0.72	-2.61	0.39	-4.59
3.	Net Profit /(Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	0.72	-2.61	0.39	-4.59
4.	Net Profit/(Loss) for the period after tax (after Exceptional and /or Extraordinary items)	0.72	-2.61	0.39	-4.59
5.	Total Comprehensive income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	0.72	-2.61	0.39	-4.59
6.	Equity share Capital	211.50	211.50	211.50	211.50
7.	Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet of the previous year	0	0	0	0
8.	Earnings Per Share(of Rs.10/-each) (for continuing and discontinued operations) 1. Basic : 2. Diluted :	-0.03 -0.03	-0.12 -0.12	0.02 0.02	-0.22 -0.22

Notes:
1. The above is an extract of the detailed format of unaudited standalone Results of the Company for the quarter ended 30th June, 2024, filed with Stock Exchange under Regulation 33 of the SEBI (Listing and other Disclosure Requirements) Regulations, 2015
2. These above reults were reviewed by the Audit Committee and were thereafter approved by the Board of Directors at their meeting held on 12-08-2024.
3. As the Company has suspended it's manufacturing operations and has sold of its land, buildings and manufacturing facilities and in the absence of final action plan / affairs and operations of the Company, The financial Statements of the Company have not been prepared on a going concern basis. These Financial Statements/results have been prepared on a realisable value basis.
4. The previous financial period figures have been re-grouped/re-arranged/re-stated wherever considered necessary.

Place : Hyderabad
Date : 12.08.2024

For **Deccan Polypacks Limited**
D.V. Prudvi Raju
Whole Time Director
DIN : 03024648

జిఒ 46పై సమగ్రంగా చర్చిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
జిఒ 46పై ఉన్న సందేహాలు, ఇతర సాంకేతిక సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం బిఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బాధితులు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి జీవోతో జరిగే నష్టంపై వివరించారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. జీవో46ను రద్దు చేసి, న్యూమరికల్ పోస్ట్‌లను సృష్టించాలని విజ్ఞప్తి చేశారు. సాంకేతిక సమస్యలపై సమాలోచన చెయ్యడానికి సిద్ధమనీ, అవసరమైన పత్రాలు సమర్పిస్తామని బాధితులు వివరించారు. ఈ నెల 19న జీవో 46పై హైకోర్టులో జరిగే విచారణకు ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. జీవో 46 రద్దుపై శాసనసభ సబ్ కమిటీలో చర్చించి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని ఈ సందర్భంగా బాధితులుకు పొన్నం హామీ ఇచ్చారు.

విఆర్ఎస్ తీసుకున్న మాజీ డిహెచ్ శ్రీనివాసరావు

- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర ప్రజారోగ్య మాజీ సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు విఆర్ఎస్‌ను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, ప్రజారోగ్య విభాగంలో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయన్ను ప్రభుత్వం గత నెల 27న మహబూబాబాద్ అడిషినల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా నియమించింది. కానీ, ఆయన లాంగ్ లీవ్‌లో ఉండటంతో జాయిన్ అవ్వలేదు. ఇన్ చార్జ్ డీహెచ్ పోస్టు నుంచి తప్పుకున్నాక ఆయన లాంగ్ లీవ్‌లోనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన రెండుసార్లు విఆర్ఎస్‌కు అప్లై చేయగా, తాజాగా ఆమోదిస్తూ సర్కార్ ఉత్తర్వులిచ్చింది.

హైదరాబాద్‌కు విస్తరించిన ఆరెంజె థియరీ ఫిట్‌నెస్

హైదరాబాద్ : సైన్స్ ఆధారిత వ్యాయామాల ఫిట్‌నెస్ బ్రాండ్ ఆరెంజెథియరీ ఫిట్‌నెస్ హైదరాబాద్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 7లో 2400 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త స్టూడియోను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు ఛబ్రియా తెలిపారు. డ్యూయల్ సర్టిఫైడ్ కోచ్‌లు వ్యక్తిగత శిక్షణ అందిస్తారన్నారు. ఇక్కడి స్టూడియోలో ఎనిమిది స్టేషన్లు ఉన్నాయన్నారు. వచ్చే మూడు, నాలుగేళ్లలో దేశంలో 40-50 స్టూడియోలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

సిఎస్ఇ, ఐటి అనుబంధ కోర్సులకు డిమాండ్

- 98.01 శాతం సీట్లు భర్తీ
- ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లు 5,039
- 81,904 మందికి సీట్ల కేటాయింపు
- 90 కాలేజీలు, 22 బ్రాంచీల్లో వంద శాతం సీట్లు భర్తీ
- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15
- కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు 17 వరకు అవకాశం
- ఎప్‌సెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రవేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కోర్సులకే భారీగా డిమాండ్ ఉన్నది. ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సోమవారం సీట్లు కేటాయించింది. సిఎస్ఇ, ఐటీ అనుబంధ కోర్సుల్లో చేరేందుకే అభ్యర్థులు మొగ్గు చూపారు. ఆయా బ్రాంచీల్లో 61,587 సీట్లుంటే, 60,362 (98.01 శాతం) మందికి సీట్లు కేటాయించారు. వాటిలో 1,225 (1.99 శాతం) సీట్లు మిగిలాయి. రాష్ట్రంలో 175 ఇంజినీరింగ్ కాలేజీల్లో 86,943 సీట్లున్నాయి. వాటిలో 81,904 (94.20 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇంకా 5,039 (5.80 శాతం) సీట్లు మిగిలాయి. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుదివిడతలో కొత్తగా 9,881 మందికి సీట్లు కేటాయించామని వివరించారు. 16,981 మంది స్లైడింగ్ చేసుకున్నారని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యలో 47 కోర్సులు అందుబాటులో ఉన్నాయనీ, వాటిలో 22 కోర్సుల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. రాష్ట్రంలో ఆరు యూనివర్సిటీ, 84 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలు కలిపి మొత్తం 90 కాలేజీల్లో వంద శాతం ప్రవేశాలను కల్పించామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 6,460 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 15 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే ఆ సీట్లు రద్దవుతాయని స్పష్టం చేశారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు మంగళవారం నుంచి ఈనెల 17 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. విద్యార్హతలకు సంబంధించి జిరాక్స్ ప్రతులు, ఒరిజినల్ టీసీని కాలేజీల్లో అందించాలని సూచించారు. ఈనెల 16 వరకు సీట్లను రద్దు చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. ఇతర వివరాల కోసం https.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 77.53 శాతం సీట్లు భర్తీ

సిఎస్ఇ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 61,587 సీట్లుంటే, 60,362 (98.01 శాతం) మందికి సీట్లు కేటాయించారు. వాటిలో 1,225 (1.99 శాతం) సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ కోర్సుల్లో 16,692 సీట్లుంటే, 14,907 (89.31 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 1,785 (10.69 శాతం) సీట్లు మిగిలాయి. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 7,458 సీట్లుండగా, 5,782 (77.53 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 1,676 (22.47 శాతం) సీట్లు మిగిలాయి. ఇతర ఇంజినీరిగ్ కోర్సుల్లో 1,206 సీట్లుంటే, 853 (70.73 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 353 (29.27 శాతం) సీట్లు మిగిలాయి. ఇంజినీరింగ్‌లో 47 కోర్సులుంటే 22లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. బిల్డింగ్ సర్వీసెస్ ఇంజినీరింగ్ కోర్సులో 66 సీట్లుంటే, తొమ్మిది (13.64 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 57 (86.36 శాతం) సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సులో 21 సీట్లుంటే, నలుగురు (19.05 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 17 (80.95 శాతం) సీట్లు మిగిలాయి. ప్లానింగ్ కోర్సులో 44 సీట్లుండగా, 12 (27.27 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 32 (72.73 శాతం) సీట్లు మిగిలాయి. ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్ కోర్సులో 69 సీట్లుంటే, 23 (33.33 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 46 (66.67 శాతం) సీట్లు మిగిలాయి.

వికలాంగుల హక్కులను కాపాడాలి

- వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఓ చైతన్య దీపిక
- పత్రిక వార్షికోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలనీ, వారి సంక్షేమం, సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో వెలువడుతున్న వికలాంగుల వాయిస్ మాస పత్రిక పదో వార్షికోత్సవ సభను సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఓ చైతన్య దీపిక అనీ, అది వారి చేతిలో ఆయుధం కావాలని వక్తలు ఆకాంక్షించారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల అధినేత పి ఉమర్ ఖాన్, జావాబ్ టీవీ సంపాదకులు నల్గొండ శ్రీనివాసులు, వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఎడిటర్ ఎం అడివయ్య, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్ కుమార్ లోద్, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ తదితరులు మాట్లాడారు. వికలాంగుల పట్ల సమాజం చిన్న చూపు చూస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని ప్రశ్నించారు. పాలకుల విధానాలే వికలాంగుల పాలిట శాపంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 21 రకాల వైకల్యాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించినా సర్టిఫికెట్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం దేశంలో 15 శాతం మంది వికలాంగులున్నారనీ, వారి జనాభా లెక్కలను ఎందుకు తీయడం లేదని ప్రశ్నించారు. కేంద ప్రభుత్వం వికలాంగుల కోసం అమలు చేస్తున్న పథకాలకు నిధుల కోత విధిస్తున్నదని వివరించారు. ఆ పేదల మీద భారాలు వేసి సంపన్నులకు పన్ను రాయితీలు ఇస్తుందని విమర్శించారు. మోడీ పాలన పేదల కోసమా? లేక సంపన్నుల కోసమా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ వాటాను రూ. ఐదు వేలకు పెంచాలనీ, దానికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ వాటా రూ. ఐదువేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మానసిక వైకల్యాలు కలిగిన వారి సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారిని నియమించాలని డిమాండ్ చేశారు. స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్ గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేయాలని సూచించారు. వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విద్యా విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వికలాంగులపై జరుగుతున్న వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పదవుల్లో వికలాంగులకు రిజర్వేషన్లు అమలు చేస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, హిమోఫిలియో, సికిల్ సెల్, తలసేమియా, కండరాల క్షీణత వంటి తీవ్ర వైకల్యాలు కలిగిన వారికి ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని హితవు పలికారు. మీ సేవ సెంటర్స్ కేటాయింపులో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, జె రాజు, సాయమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి స్వామి, అరిఫా, కాశప్ప, సహాయ కార్యదర్శులు వి ఉపేందర్, జె దశరథ్, పి బలిశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, భుజంగారెడ్డి, లింగన్న, షాయినా బేగం, వెంకన్న, శ్రీనివాస్, లలిత, రాములు, యేశాల గంగాధర్, బాలయ్య,, నాయకులు సుల్తాన్ రమేష్,సంతోష చంద్రమోహన్,శ్రీనివాస్, బాలు వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- హైదరాబాద్, సిద్ధిపేటలో ఘటనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఐదుగురు యువకులు మృతి చెందారు. బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందగా.. సిద్దిపేటలో బైక్‌ను, లారీని డిసిఎం ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణం కోల్పోయారు. హైదరాబాద్ ఘటనకు సంబంధించి బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..

సైదాబాద్ శంకేశ్వర్ బజార్‌కు చెందిన బ్యాగరీ శ్రీహరి (28), అదే ప్రాంతానికి చెందిన సందీప్ (20), అభిలాష్ (20) స్నేహితులు. సైదాబాద్‌లో ఆదివారం బోనాల పండుగకు వెళ్లి సోమవారం ఉదయం మైలార్దేవులపల్లికి బైక్‌పై ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట మీదుగా ఆశమాబాద్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో ముగ్గురు 20 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలపాలైన సందీప్, అభిలాష అక్కడికక్కడే మృతి చెందారు. రక్తపు మడుగులో ఉన్న శ్రీహరిని స్థానికులు సమీప ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుల సెల్‌ఫోన్ల ఆధారంగా వారి పేర్లు, బంధువులను కనుక్కొని విషయాన్ని తెలిపారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పజెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

ద్విచక్ర వాహనం, లారీని ఢీకొట్టిన డిసిఎం

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామం గుర్రాల సోఫా సమీపంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తొగుట సిఐ షేక్ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మొక్కజొన్న కంకులను నింపుకొని చేగుంట వైపు వెళుతున్న డిసిఎం వడ్డేపల్లి గుర్రాల సోఫా సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ తర్వాత గజ్వేల్ వైపు వస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీని ఢీకొట్టి డిసిఎం బోల్తా పడింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై గజ్వేల్ వైపు వెళ్తున్న దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన మామిండ్ల నవీన్ (20), మామిండ్ల వంశీ (19) అక్కడికక్కడే మృతి చెందారు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ చాకలి రాకేష్ తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని డీసీఎం డ్రైవర్ రాకేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. నవీన్, వంశీ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ షేక్ లతీఫ్ తెలిపారు.

మై హోమ్ నుంచి 'అక్రిడా' ప్రాజెక్టు

- గోపన్‌పల్లిలో 25 ఎకరాల్లో నిర్మాణం

హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ మై హోం గ్రూప్ మరో ప్రతిష్టాత్మక నివాస ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. నగరంలోని గోపన్‌పల్లి నుండి తెల్లాపూర్ రోడ్ మధ్యలో మై హోమ్ అక్రిడా పేరుతో దీన్ని ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలోని అక్రిడా కింద 12 టవర్లలో 3780 ఫ్లాట్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఫేజ్-1లో భాగంగా 6 టవర్లు బుకింగ్ కోసం తెరువబడ్డాయని వెల్లడించింది. ప్రతిమ గ్రూప్ భాగస్వామ్యంలో దాదాపు 24.99 ఎకరాలలో జిప్లస్ 39 అంతస్తుల్లో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపింది. ఫ్లాట్ల పరిమాణం 1399 చదరపు అడుగుల నుంచి 2347 చదరపు అడుగుల మేర ఉంటుందని తెలిపింది. సౌకర్యం, లొకేషన్ సౌలభ్యం, కమ్యూనిటీలకు దగ్గరగా ఉండేలా హౌసింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడంలో మై హోం మూడు దశాబ్దాలుగా అగ్రగామిగా ఉందని మై హోమ్ గ్రూపు చైర్మన్ రామేశ్వర్ రావు పేర్కొన్నారు.

కెటిఆర్‌ను అరెస్టు చేయొద్దు

- మేడిగడ్డ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామరావు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, బాల్క సుమన్‌లు గతనెల 26న మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ఇరిగేషన్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మహదేవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు స్టే విధించింది. మేడిగడ్డ ఇరిగేషన్ అధికారి గతనెల 29న ఇచ్చిన ఫిర్యాదులో సదరు నేతలు మేడిగడ్డ రిజర్వాయర్ సందర్శన సమయంలో డ్రోన్ కెమెరా వినియోగించారనీ, దాని వల్ల ప్రాజెక్టుకు నష్టం వస్తుందని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఆ ముగ్గురు బీఆర్ఎస్ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. మహదేవ్‌పూర్ పీఎస్‌లో నమోదైన కేసులో కేటీఆర్ ఇతర బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయొద్దనీ, ఇతర చర్యలూ తీసుకోరాదని ఆదేశించారు. కేసు దర్యాప్తునే నిలిపివేస్తూ స్టే ఇచ్చారు. విచారణను వచ్చే నెల మొదటి వారానికి వాయిదా వేశారు.

మెడికల్ అడ్మిషన్లలో స్థానికులకు నష్టం

రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో అడ్మిషన్ అర్హత నిబంధనలను మార్పు చేస్తూ గత నెల 19న జారీ అయిన జిఒ 33ను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సోమవారం హైకోర్టు విచారించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గత నిబంధనలను సవరించి అందులో 3ఏను చేర్చుతూ జీవో 33 జారీ వల్ల తెలంగాణ లోకల్ స్టూడెంట్స్‌కు అన్యాయం జరుగుతుందనే పిటిషన్లలో మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. ప్రభుత్వ వాదనలు విన్నాకే తగిన ఆదేశాలిస్తామని చెప్పింది. మంగళవారం అడ్మిషన్లకు చివరి రోజని పిటిషనర్ల లాయర్లు చెప్పారు. అడ్మిషన్లకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివి ఉండాలనే నిబంధనను కొత్తగా తేవడం వల్ల స్థానికులకు నష్టమన్నారు. పదో తరగతి వరకు తెలంగాణలో చదివి తల్లిదండ్రుల ఉద్యోగ, ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లిన వాళ్లు తహసీల్దార్ ద్వారా లోకల్ ధ్రువీకరణ పత్రం పొందిన వారికి స్థానికత ఉండేదన్నారు. మెడికల్ అండ్ హెల్త్ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ, ఎన్టీపీలకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను ఈనెల 14కి వాయిదా వేసింది.

మరో బెంచ్‌కి లా అడ్మిషన్ల కేసు

రాష్ట్రంలోని లా కాలేజీల అడ్మిషన్లు తీవ్ర జాప్యం అవ్వడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ లాయర్ భాస్కర్‌రెడ్డి వేసిన పిల్‌ను విచారించేందుకు చీఫ్‌జస్టిస్ అలోక్ అరాధే నిరాకరించారు. ఈ వివాదంలోకి నల్సార్ యూనివర్సిటీ ఉన్నదనీ, ఆ యూనివర్సిటీకి తాను చాన్సలర్‌గా ఉన్నందున మరో బెంచ్‌కి పిల్‌ను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ తెలిపింది. ఇదిలా ఉండగా, వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లా, కూకట్‌పల్లిలోని అనంత లా కాలేజీల్లో లా అడ్మిషన్లు నిలిపేసినట్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా హైకోర్టుకు తెలిపింది.

మియాపూర్‌లో బే విండో కొత్త స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : మియాపూర్‌లో తమ మూడవ ఫర్నీచర్ స్టోర్‌ను ప్రారంభించినట్లు బే విండో వెల్లడించింది. బే విండో తొలి రెండు స్టోర్లు జూబ్లీహిల్స్, గచ్చిబౌలిలో ఉన్నాయి. లివింగ్ రూమ్‌లు, డైనింగ్ రూమ్‌లు, బెడ్‌రూమ్‌లను మార్చడానికి రూపొందించిన విస్తృతమైన ఫర్నీచర్‌ను అందించడానికి తమ సంస్థ కట్టుబడి ఉందని బే విండో వ్యవస్థాపకులు సిద్ధాంత్ ఆనంద్ అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో ఐదు స్టోర్లు. 2025 చివరి నాటికి హైదరాబాద్ వెలుపల మరో ఐదు స్టోర్లను ప్రారంభించాలని యోచిస్తోన్నామన్నారు.

ఐసిఎస్ఐ గోల్డెన్ జూబ్లీ ఇయర్ ఉత్సవాలు

- హైదరాబాద్ చాప్టర్ 50 ఏళ్ల వ్యవస్థాపక దినోత్సవం

హైదరాబాద్ : ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఘనంగా 50 ఏళ్ల వ్యవస్థాపక దినోత్సవాలు, గోల్డెన్ జూబ్లీ ఇయర్‌ను నిర్వహించుకుంది. నగరంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం విశేషం. గోల్డెన్ జూబ్లీ ఇయర్ సందర్భంగా తమ విద్యార్థులు ఆగస్టు 1 నుంచి 15వ తేది వరకు పలు వైద్య క్యాంప్‌లు, రక్తదానం, పారిశ్రామిక సందర్శనలు చేపడుతున్నారని ఐసిఎస్ఐ మైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ సిఎస్ గామిని శ్రీ లక్ష్మీ నారాయణ గుప్తా తెలిపారు.

గురుకులాల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో
గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ లో పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్, ములుగు కలెక్టర్లకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖలు, ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలు జారీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో పొరపాట్లు తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం నాడు ఆదిలాబాద్ లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి అక్కడ పర్యటించిన మంత్రి సీతక్క, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్, ఉట్నూరు పిఒ, డిఆర్‌డిఒ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో, వసతి గృహాల్లో పారిశుధ్య నిర్వహణను సమీక్షించారు. ఆయా పాఠశాలల నుంచి నివేదిక తెప్పించుకున్నారు. దోమల నివారణపై మరి ఇంత ఫోకస్ పెట్టాలని, ప్రతిరోజు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల ఆవరణలో నీరు నిలవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రహరీ గోడల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరచాలని చెప్పారు. ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరగకుండా కిచెన్ కిచెన్, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

అనంతరం ఆదిలాబాద్ నుంచి ములుగు కలెక్టర్ దివాకర్ టి.ఎస్., విద్యాశాఖ జిల్లా అధికారులు, పాఠశాలలు గురుకులాల ప్రిన్సిపల్స్, హాస్టల్ వార్డెన్ లతో టెలిఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో నెలకొని ఉన్న పారిశుధ్య స్థితిగతులను తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమీక్ష సమావేశాల సందర్భంగా సంబంధిత శాఖ అధికారులకు మంత్రి వార్నింగ్ ఇచ్చారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. విధుల పట్ల అలసత్వం వహించినా, దురదష్ట కరణ ఘటనలు జరిగినా.. మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని మంత్రి తేల్చి చెప్పారు. ఉద్యోగాలు పోగొట్టుకునే పరిస్థితి కొని తెచ్చుకోవద్దని మంత్రి సీతక్క హెచ్చరికలు జారీ చేశారు.

మంత్రి ఆదేశాలతో వెనువెంటనే రంగంలోకి దిగిన కలెక్టర్లు..పాఠశాలలు, హాస్టల్స్ వారీగా ప్రత్యేక సమీక్షలు చేపట్టి, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నివారణ చర్యలు రూపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. మండల వారీగా స్కూళ్లను హాస్టలను పరిశీలించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు.

తెలంగాణ ఉద్యోగ జెఎసికి పూర్వవైభవం

- 53 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో ఏర్పాటు
- చైర్మన్‌గా మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావు
- 15 రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం : నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సమస్యల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఉద్యోగ జెఎసి ఆవిర్భవించింది. రాష్ట్రంలోని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లతో కూడిన 53 సంఘాలతో ఏర్పాటైంది. సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ జెఎసి ఎంత క్రియాశీలక పాత్ర పోషించిందో ఇప్పుడు ఆ బాధ్యతను ఈ జెఎసి నెరవేర్చనుంది. పదేండ్ల తర్వాత తెలంగాణ ఉద్యోగ జెఎసి ఏర్పడి పూర్వవైభవానికి నాంది పలికింది. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టిఎన్‌జిఒ కేంద్ర కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం 15 మందితో స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ ఉద్యోగ జెఎసి చైర్మన్‌గా టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్‌గా టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉద్యమంలో పాల్గొన్న సంఘాలను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం : జగదీశ్వర్

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని జగదీశ్వర్ అన్నారు. స్నేహపూర్వక ప్రభుత్వమంటూనే ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన తప్పిదాల వల్లే ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చున్నామంటూ బిఆర్ఎస్ నాయకులే చెప్తున్నారని గుర్తు చేశారు. ఇష్టమొచ్చినట్టు జోనల్ విధానం తెచ్చారని విమర్శించారు. 317 జీవోను తెచ్చి ఇష్టమొచ్చినట్టు ఉద్యోగులను విభజించారని అన్నారు. అప్పుడు తమ సంఘం అధ్యక్షులు మాట్లాడే పరిస్థితి లేదనీ, చెప్పినా నాటి సీఎం వినలేదని చెప్పారు. స్థానికత ప్రకారం 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీన జీతాలివ్వడం సంతోషమేనని అన్నారు. అయితే ఉద్యోగులందరికీ రావడం లేదనీ, అందరికీ 010 పద్దు కింద జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జీతమిస్తేనే పండుగ చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేశాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కార్డులపై కమిటీ ఏర్పాటు చేసి నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల చందాతో కూడిన ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలను అమలు చేయాలని కోరారు. విఆర్‌ఒ వ్యవస్థ లేదనీ, అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. గచ్చిబౌలి, భాగ్యనగర్ హౌజింగ్ సొసైటీల భూముల కేటాయింపు జీవోలను సవరించాలని కోరారు. 15 రోజుల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. నల్లబ్యాడ్జీలు ధరిస్తామనీ, భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని అన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే అన్ని సంఘాలతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం కొట్లాడతామని చెప్పారు.

ఆగస్టు 15 తర్వాత సమస్యలు పరిష్కారం : ఏలూరి

ఈనెల 15 తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం చెప్పిందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఈ-కుబేర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు టోకెన్ సిస్టం ఉండొద్దని సూచించారు.

పిఆర్‌సి నివేదిక తెప్పించి అమలు చేయాలి : చావ రవి

పదేండ్ల తర్వాత ఉద్యోగ జెఎసి ఏర్పాటు కావడం శుభపరిణామమని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. ఉద్యోగు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల మధ్య రాబోయే రోజుల్లో ఐక్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక వాగ్దానాలను ఇచ్చిందనీ, వాటిని నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించాలి : శ్రీపాల్‌రెడ్డి

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందించి అమలు చేయాలని పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు.

ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణకు అవకాశం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యావ్యవస్థలో పర్యవేక్షణ వ్యవస్థ లేదన్నారు. డీఈవో పోస్టులను మంజూరు చేయలేదనీ, ఇన్‌చార్జీ డీఈవోలు కొనసాగుతున్నారని చెప్పారు. టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని కోరారు. ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు తహసీల్దార్లను బదిలీ చేశారనీ, వారి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్ (టీఎన్జీవో), సత్యనారాయణ (టిజిఒ), పి మధుసూదన్‌రెడ్డి (జిజెఎల్ఎ), చంద్రశేఖర్‌గౌడ్ (గ్రూప్-1 అధికారుల సంఘం), గౌతంకుమార్ (ట్రెసా), ఎం పర్వత్‌రెడ్డి (ఎస్‌టియుటిఎస్), అంజిరెడ్డి (టిఆర్‌టిఎఫ్), రాధాకృష్ణ (టిపిటియు), మణిపాల్‌రెడ్డి (టిటియు) తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత వసతి భోజనం

- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ద్వారా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు 2024 కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ కమిషనర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎస్‌టి అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఎఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో మెయిన్స్ సన్నద్ధమయేందుకు మెంటార్ గైడెన్స్‌తో పాటు, ఒక ట్యాబ్, ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్‌టి అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వారు యూపీఎస్సీ - సీఎస్సీ - ప్రిలిమినరీ పరీక్ష 2024 నందు ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించి ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382620487, 7093466985 సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం నిర్వీర్యం

- 15.30 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం నిర్వీర్యం అయిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో సాగు విస్తీర్ణం పెరిగితే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు పడిపోయిందని నిలదీశారు. ఒక్క ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గడం తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలోనే దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం ఎందుకు ఏర్పడిందో చెప్పాలన్నారు.

ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని కెటిఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని మండిపడ్డారు. "కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు. రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు. చెరువులకు నీళ్లు మళ్లించే ప్రణాళిక లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. కాంగ్రెస్ పాలనలో.రైతు బతుకుకు భరోసానే లేదు" అని కెటిఆర్ అన్నారు. రుణమాఫీ అని మభ్య పెట్టి, పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ ఏర్పడిందని ఆరోపించారు. ఎరువులు-విత్తనాల కోసం రైతులు క్యూలైన్లో పాసుబుక్కులు, చెప్పులు పెట్టే ఆ నాటి పరిస్థితి మళ్లీ తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రుణాల కోసం బ్యాంకుల వద్ద, పగలూ రాత్రి తేడాలేకుండా పడిగాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.